

# నిజముగ తెలుపవె మనసా

- ఆకునూరి మురళీకృష్ణ

"నాన్నా ఇదిగో అప్లికేషన్. ఇక్కడ మీరు సంతకం పెట్టాలి. అప్లై చేసినంత మాత్రాన స్కాలర్‌షిప్ వస్తుందన్న గ్యారంటీ ఏమీ లేదనుకోండి... దానికి కూడా మళ్ళీ ఎంతో తతంగం వుంది. ఎమ్మార్వో ఆఫీసులో మా ఫ్రెండు వాళ్ళ నాన్నగారికి ఎవరో తెలిసిన వాళ్ళు వున్నారట. మిగిలిన విషయాలు ఆయన చూస్తారని హామీ ఇచ్చారు" అన్నాడు చైతన్య కాగితాలను నా ముందుకు తోస్తూ, 'నువ్వు సంతకం మాత్రం పెడితే చాలు... మిగిలిన సంగతులన్నీ నేను చూసుకుంటాను' అన్నట్టుగా వుంది వాడి ముఖం.

నేను ఆ పేపర్ల వంక చూసాను. ఆర్థికంగా వెనుకబడిన తరగతుల వారి పిల్లల చదువుకోసం నెలనెలా ప్రభుత్వం అందజేసే గ్రాంటుకోసం దరఖాస్తు ఫారం అది.

ఆ కాగితాలని, ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న నా ఆఖరి కొడుకు చైతన్యనీ ఒకసారి మార్చి మార్చి చూసి కోపంగా అన్నాను "వద్దన్నాను కదా? మళ్ళీ అప్లికేషన్ ఎందుకు తీసుకువచ్చావు?"

చైతన్య ఒక్క నిమిషం ఏమీ మాట్లాడలేదు. తరువాత నెమ్మదిగా అన్నాడు.

"ఇన్నాళ్ళకి రాక రాక మనకే ఒక అవకాశం వచ్చింది. మా ఫ్రెండ్సంతా పెడుతున్నారు. మనమూ ఒక అప్లికేషన్ పారేస్తే ఏమవుతుంది? వస్తే వస్తుంది, లేకపోతే లేదు. ఇందులో తప్పేం వుందో నాకు అర్థం కావడం లేదు..." ఎంత నెమ్మదిగా అన్నా వాడి ముఖంలో అసహనం నాకు తెలిసిపోతూనే వుంది.

"ఇన్నాళ్ళకి రాక రాక మనకే ఒక అవకాశం వచ్చింది' అన్న వాడి మాటల్లోని అర్థాన్ని గ్రహించిన నాకు బాధేసింది. "అందరూ తీసుకుంటున్నారని మనమూ తీసుకుందామా?" అన్నాను నేను వాడిని పరిశీలనగా చూస్తూ.

ఇద్దరు పిల్లల తరువాత ఇంక ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించేసుకుందామనుకుంటున్న తరుణంలో అనుకోకుండా కడుపులో పడ్డవాడు వాడు. పెద్దవాళ్ళకీ వాడికీ మధ్యన వయసు వ్యత్యాసం చాలా వుంది. ఎదుగుతున్న వయసులో పెద్దవాళ్ళు ఇద్దరిని చూసినప్పుడు ఎన్నడూ కలుగని భయం నాకు చైతన్యని చూస్తే కలుగుతూ వుంటుంది.

"ఆ స్కాలర్‌షిప్ రాకపోతే నీ చదువేమైనా ఆగిపోతుందనుకుంటున్నావా?" అన్నాను.

చైతన్య మాట్లాడలేదు. "నేను చేసింది గుమాస్తా ఉద్యోగమే కావచ్చు. కానీ అదే జీతంతో అక్కయ్యకి, అన్నయ్యకీ చదువులు చెప్పించాను. అక్కయ్య పెళ్ళిచేసాను. మీ అన్నయ్య జీవితంలో స్థిరపడేలా చేసాను. నీ చదువు నాకు పెద్ద భారమేం కాదులే. నేను రిటైరయ్యానేమైనా పీలవుతున్నావేమో? రిటైరై పెన్షన్ జీతంలో సగమైనా వంట్లో ఓపిక మాత్రం అలాగే వుంది లేరా. ఎక్కడో ఒకచోట పద్దులు రాసైనా నీ చదువుకి కావాల్సిన డబ్బు సంపాదించగలను. అందుకే నువ్వు దాని గురించేం బెంగ పెట్టుకోకు. దృష్టినంతా చదువు మీద నిల్పి శ్రద్ధగా చదువుకో" అంటూ అనునయంగా చెప్పాను.

నేను చెప్పిన దానికి వాడు ఎంతవరకూ కన్విన్స్ అయ్యాడో తెలియదు గానీ, ఆ అప్లికేషన్ మీద నేను సంతకం చేయనున్న విషయం మాత్రం అర్థమైనట్లుగా దానిని వెనక్కి తీసేసుకున్నాడు. అప్పటికి మాట్లాడకుండా ఊరుకున్నాడు గానీ ఆ తరువాత వంటింట్లో తల్లి వెనుక చేరి సతాయించడం మొదలు పెట్టాడు.

"సంతకం పెట్టమంటే హరికథలు చెబుతారేమిటమ్మా? మనమేమైనా లక్షాధికారులమా కోటీశ్వరులమా గవర్నమెంటు వాళ్ళు ఇస్తానన్న డబ్బు అక్కర్లేదని తిప్పి కొట్టడానికి? ఎంతోమంది దొంగ సర్టిఫికెట్లు పెట్టి మరీ తీసుకుంటున్నారు. నేనేమైనా అలా చేయమన్నానా? మన అదృష్టం బాగుండి ఇన్‌కమ్ సీలింగ్ ఈ సంవత్సరం పెంచబట్టి మనకి ఎలిజిబిలిటీ వచ్చింది గానీ, లేకపోతే మనం ఎంత మొత్తుకున్నా ఎవడూ ఇచ్చేవాడు లేడు. మా ఫ్రెండు వాళ్ళ నాన్నగారు ఎమ్మార్వో ఆఫీసులో రికమెండ్ చేసి పని జరిగేటట్టు చేస్తానన్నారు కూడా... ఒక్క సంతకం పెడితే ఆయన సొమ్మేం పోతుంది?..."

దానికి రుక్మిణి వాడిని అనునయిస్తూ ఏదో సమాధానం చెబుతోంది.

వాడి మాటలు ముందు గదిలో కూర్చున్న నాకు వినబడుతూనే వున్నాయి. బహుశా నేను వినాలనే కొంచెం గట్టిగా మాట్లాడుతున్నట్టున్నాడు. ఇలాంటి ప్రవర్తన పెద్దవాళ్ళు ముగ్గురిలో ఎప్పుడూ చూడలేదు నేను. ఏదైనా చెప్పదలుచుకుంటే నిర్మొహమాటంగా నా ఎదురుగా వచ్చి చెప్పేవారు. నా అభిప్రాయం తప్పుని వాళ్ళు కనిపెస్తే నాతోనే నేరుగా ధైర్యంగా చెప్పి వాళ్ళలా ఎందుకనుకుంటున్నారో వివరించేవారు. చాలాసార్లు వాళ్ళ వాదన విని నా అభిప్రాయాలెన్నింటినో మార్చుకున్నాను నేను. కానీ ఇలా పిరికివాళ్ళలా చాటునుంచి ఎప్పుడూ మాట్లాడేవారు కాదు వాళ్ళు. అందుకే నాకు వీడ్ని చూస్తే భయమేస్తుంది...

"వాడేదో స్కాలర్‌షిప్‌కి అప్లై చేస్తానంటే వద్దన్నారటెందుకండీ?" అంది ఆ రోజు రాత్రి రుక్మిణి నాతో రాయబారం చేస్తూ. నేను ఆమె వంక తీక్షణంగా చూసాను.

"అసలు స్కాలర్‌షిప్ అంటే అర్థం తెలుసా వాడికి? నేనేమైనా కాదంటే నీ వెనుక చేరి సతాయించి నామీద ఒత్తిడి తేవడం మాత్రం తెలుసు" అన్నాను కోపంగా. "ఆ ఇచ్చే డబ్బు చదువులో వీడి ప్రతిభా పాటవాలని చూసి ఇస్తుంటే నిరభ్యంతరంగా తీసుకోమని చెప్పి వుండే వాడిని. అప్పుడు అప్లికేషన్ మీద నా సంతకం కూడా అవసరం వుండేది కాదు, కానీ వాడంటున్న ఈ 'స్కాలర్‌షిప్' ఇచ్చేది వాడి చదువుని చూసి కాదు, మన పేదరికాన్ని చూసి!"

నాకు కోపం వచ్చిందన్న విషయాన్ని గ్రహించిన ఆమె కాసేపు మౌనంగా వుంది. ఆ తరువాత మళ్ళీ "ఏదేమైనా వచ్చే డబ్బుని కాదనుకోవడం ఎందుకు?" అంటూ మళ్ళీ కొడుకు వాదనని తన గొంతుతో సున్నితంగా వినిపించబోయింది.

నేను అసహనంగా చూసాను ఆమె వంక. "చూడు రుక్మిణీ... పెద్దవాళ్ళు చదువుకునే రోజుల్లో మనం ఇంతకన్నా పేదరికంలో వుండే వాళ్ళం... అప్పట్లో తక్కువగా వున్నా ఆ ఫీజులే మనకి బోలెడంత భారమనిపించేవి. అయినా మనం డబ్బుకోసం ఎవరి ముందూ చేయి చాపలేదు. సీత సాయంత్రం పూట ట్యూషన్లు చెప్పేది. రామం కంప్యూటర్ సెంటర్లో

జాబ్ వర్క్ చేసేవాడు. నేను రాత్రుళ్ళు బట్టలకొట్లో పద్దులు రాసేవాడ్ని. నువ్వు కూడా ఊరగాయలు పెట్టి హాస్టళ్ళలో అమ్మేదానివి... వాళ్ళ చదువు నిరాఘాటంగా సాగిపోయింది. అవన్నీ గుర్తులేవా? అప్పటికీ ఇప్పటికీ మన ఆర్థిక పరిస్థితుల్లో ఎంత మార్పు? ఎంత వెసులుబాటు వచ్చిందో నీకు తెలియదా? పెద్ద వాళ్ళిద్దరికీ సరైన బట్టలు కూడా వుండేవి కావు కాలేజీకి వెళ్ళడానికి. పర్సులో బస్సు పాసు తప్ప స్నేహితులతో సరదాగా కేంటీన్లో టీ త్రాగడానికి రూపాయి డబ్బులు కూడా వుండేవి కావు. ఇప్పుడు వీడిని మన ఖర్చుతో సెలవులలో స్నేహితులతో టూర్ ప్రోగ్రామ్స్‌కి కూడా పంపగలుగుతున్నాం. ఇంకా ఏం కావాలని దేవుళ్ళాడడం?" అన్నాను.

ఒక్క క్షణం నన్ను వింత మనిషిని చూసినట్లు చూసింది రుక్మిణి. "మనమేదో పేదరికంలో వున్నామని కాదండీ... గవర్నమెంటే స్వయంగా ఆదాయ పరిమితిని పెంచింది కనుక మనకే అవకావం వచ్చింది. అవకాశం వున్నప్పుడు ఎందుకు వదులుకోవాలి? వాడు చెబుతూ వుంటాడు. వాడి కాలేజీలో పెద్ద పెద్ద ఆఫీసర్ల పిల్లలు కూడా కులాల పేరుతో వచ్చే స్కాలర్‌షిప్‌లని ప్రభుత్వం దగ్గరనుంచి గుంజుతూ జల్సా చేస్తుంటారుట... అలాంటిది న్యాయంగా వచ్చే సొమ్ముని మనమెందుకు వదులుకోవాలీ అంటాడు. వాడన్నదాంట్లో కూడా నిజం వుంది కదా? ఇందులో మనం ఎవర్నీ మోసం చేస్తున్నదేమీ లేదు కదా? ఈ విషయంలో మీరెందుకిలా మొండి పట్టుదల పడుతున్నారో నాకర్థం కావడం లేదు" అంది.

ఆమె మాటలకి నేను ఆశ్చర్యంగా చూసాను. అదంతా చైతన్య ప్రభావమని నాకు తెలుసు. ఆమెని అంత చక్కగా మౌల్డ్ చేయగల్గిన చైతన్య వాక్చాతుర్యానికి, వాదనా పటిమకీ నాకు ఆశ్చర్యమనిపించింది. ఆ తెలివితేటలని వాడు చదువులో చూపించి వుంటే ఎంత బాగుండేది?

వాడి మాటలతో కలుషితమైపోయిన ఆమె ఏ విధంగానూ చెప్పినా 'నేనెందుకు కాదంటున్నానో' అర్థం చేసుకోలేదనిపించి మౌనంగా వుండిపోయాను. అయినా రుక్మిణి రాయబారం వదల్లేదు.

"ఆ డబ్బు వస్తే బైక్ కొనుక్కుందామని దానిమీద వాడెన్నో ఆశలు పెట్టుకున్నాడండీ... కళ్ళముందు తోటి పిల్లలంతా ఎంత ఆడంబరంగా కనిపిస్తూ వున్నా ఇన్నాళ్ళూ వాడు మన స్థితిగతులకి తగ్గట్టుగా అన్నింటికీ సర్దుకుపోతూనే వున్నాడు. దేనికీ పేచీ పెట్టలేదు. ఇప్పుడు కూడా మీ జేబులోంచేం ఇమ్మనడం లేదు కదా? కేవలం సంతకం పెట్టమంటున్నాడంతే" అంది. ఈసారి ఆమె కంఠంలో కొద్దిగా నిష్ఠూరం తొంగిచూసింది.



నా జీవితంలో ప్రతి స్టేజీలోనూ పేదరికం నన్ను వెక్కిరించేది. జీవితంలో నేను డబ్బుకోసం పడ్డ ఇబ్బంది మరి దేనికోసమూ పడలేదు. అయినా సరే లెఖ్ఖ చేయకుండా ఎప్పటికప్పుడు మనోస్థైర్యంతో నెట్టుకొస్తూ ఎంతో జాగ్రత్తగా ఆర్థిక ప్రణాళికలు రచిస్తూ అతి కష్టమ్మీద అన్ని బాధ్యతలూ నెరవేరుస్తూ వచ్చాను.

ఆమె మరేదో మాట్లాడబోతుంటే నేను కోపంగా అక్కడినుంచి లేచి బయటికి వచ్చేసాను ఆ విషయంలో ఇంక మాట్లాడేదేమీ లేదనడానికి సంకేతంగా.

❊ ❊ ❊

మర్నాడు రామం దగ్గరనుంచి నాకు ఫోన్ వచ్చింది. "ఏమిటి నాన్నా చైతూ మళ్ళీ ఏదో గొడవ చేస్తున్నాట్ట?" అన్నాడు నవ్వుతూ.

అప్పుడే ఆ విషయం బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్న పెద్దవాడిదాకా వెళ్ళిందన్న మాట? అందరిలోకీ చిన్నవాడు కావడంతో చైతన్యంటే ఇంట్లో అందరికీ ముద్దూ గారమూనూ. అదే వాడిని పాడుచేస్తోందని ఒక్కోసారి నాకు అనిపిస్తూ వుంటుంది. తల్లితో చెప్పించడం కుదరకపోయేసరికి నాకు రామం మాటంటే గురి అని వాడితో చెప్పించాలని చూస్తున్నాడల్లే వుంది...


మళ్ళీ రామమే అన్నాడు "నాకు అమ్మ చైతన్యా అంతా చెప్పారులే. అవును నాన్నా... వాడు ఆ డబ్బుదేనికి వాడుతాడన్నదాన్ని పక్కన పెట్టు. అసలు ఎలిజిబిలిటీ వున్నప్పుడు స్కాలర్‌షిప్‌కి అప్లై చేస్తానంటే నువ్వెందుకు నీకిష్టం లేదన్నావు?" అన్నాడు రామం.


రామం మాటలకి నాకు ఆనందం వేసింది. ఇన్నాళ్ళూ తల్లీ కొడుకులు తప్పేముందీ అంటూ నాతో వాదనలకి దిగారే గానీ నాకెందుకు ఇష్టం లేదని నా యిష్టాయిష్టాలని కనుక్కోవడానికి ప్రయత్నం చేయలేదు. నా మనసులోని భావాలని రామం అర్థం చేసుకోగలడనిపించింది.

నేను నెమ్మదిగా నా మనసు విప్పి చెప్పసాగాను. "రామం... నీకు చిన్నతనం నుంచీ మన కుటుంబ పరిస్థితులు తెలుసు... పెద్ద కుటుంబం... ఎన్నెన్నో బాధ్యతలు... ఖర్చులు... సంపాదన అంతంత మాత్రం. అందుకే ప్రతి చిన్న విషయానికీ రాజీపడాల్సి వచ్చేది. ప్రతి చిన్న ఖర్చుకీ భయపడాల్సి వచ్చేది. చిన్న చిన్న అవసరాలు కూడా ఎంతో కష్టపడితే కానీ తీరేవి కావు. మీ అత్తయ్యల పురుళ్ళూ పెట్టుపోతలూ, తాతయ్యా నాన్నమ్మల ఆసుపత్రి ఖర్చులూ, మీ చదువులూ, అక్కయ్య పెళ్ళి... అన్నీ ఒక్కడ్నే భుజాలమీద మోస్తూ వచ్చాను. మీరంతా మీకు చేతనైన సాయం మీరూ చేసారనుకో ఆ వయసులో కూడా!

అవన్నీ తల్చుకుంటే ప్రతి కష్టాలనెలా దాటుకుని వచ్చానా అని ఇప్పుడు నాకు చాలా ఆశ్చర్యంగా అనిపిస్తుంది. నా జీవితంలో ప్రతి స్టేజీలోనూ పేదరికం నన్ను వెక్కిరించేది. జీవితంలో నేను డబ్బుకోసం పడ్డ ఇబ్బంది మరి దేనికోసమూ పడలేదు. అయినా సరే లెఖ్ఖ చేయకుండా ఎప్పటికప్పుడు మనోస్థైర్యంతో నెట్టుకొస్తూ ఎంతో జాగ్రత్తగా ఆర్థిక ప్రణాళికలు రచిస్తూ అతి కష్టమ్మీద అన్ని బాధ్యతలూ నెరవేరుస్తూ వచ్చాను. ఇప్పుడిప్పుడే కాస్త కాలూ చెయ్యీ కూడదీసుకుంటూ ఆర్థికంగా అభ్యున్నతి సాధించగలిగానని సంతోషంగా అనిపిస్తూ వుంటుంది నాకు. మీ చదువులకోసం ఎంతో కష్టపడిన నాకు ఇప్పుడు ఏ కష్టం లేకుండా చైతన్యని ఇంజనీరింగ్ చదివించగలిగిన స్థాయికి చేరుకున్నందుకు చాలా ఆనందంగా అనిపిస్తూ వుంటుంది. ఆ ఆనందంతోనే నేను నా చివరి ఈ బాధ్యతని నెరవేరుస్తున్నాను.

(మిగతా 27వ పేజీలో)



(19వ పేజీ తరువాయి)

ఎన్ని కష్టాలు అనుభవించినా ఇన్నాళ్ళూ జీవితంలో నేను ఏదో కోల్పోయానన్న బాధ నాకేమీ లేదు. నా రెక్కల కష్టమ్మీద ఈరోజు కుటుంబాన్ని ఈ స్థితికి తీసుకురాగలిగానన్న విషయాన్ని తల్చుకున్నప్పుడు నాకు చాలా గొప్పగా వుంటుంది. ఇన్నాళ్ళ సుదీర్ఘ పోరాటం చేసి నన్ను వెంటాడిన పేదరికాన్ని జయించానని గర్వంగా అనిపిస్తూ వుంటుంది. అలాంటిది... ఇప్పుడు గవర్నమెంటు రూల్సుని నడిపించింది కదా అని ఆ స్కాలర్‌షిప్‌కోసం దరఖాస్తు చేయడం అంటే అదే పేదరికం మళ్ళీ నన్ను వెక్కిరిస్తున్నట్టుగా అనిపిస్తోం దిరా... ఎంత ఊరికే డబ్బు వస్తుందనుకున్నా ఎందుకో... ఆ అప్లికేషన్ మీద సంతకం చేయడం అంటే జీవితంలో నేను ఓడిపోయానని ఒప్పుకోవడమే నని నాకనిపిస్తోందిరా... నా ఫీలింగ్ కరెక్టో కాదో నాకు తెలియదు..."

నా మాటలు వింటున్న రామం ఒక్క క్షణం మౌనంగా వుండిపోయాడు. "నీ మాటలు వింటుంటే నాకు కళ్ళల్లో నీళ్ళు వస్తున్నాయి నాన్నా... నేను అంత దూరం ఆలోచించలేదు. అమ్మా చైతన్యే కాదు నేనూ నిన్ను సరిగ్గా అర్థం చేసుకోలేదనిపిస్తోంది ఈ విష యంలో" అన్నాడు. వాడి కంఠం ఆర్ద్రమవడం తెలుస్తూనే వుంది.

నేను సర్దుకుంటూ అన్నాను. "సరే... ఆ విషయాన్ని పక్కనపెట్టు. నాణానికి అది ఒక వైపు అయితే మరో వైపు చైతన్య అలవర్చుకుంటున్న ఆలోచనా విధానం. అవకాశం వుంది కదాని నాతో సంతకం పెట్టించుకుని ఎవరిచేతనయినా రికమెండేషన్ చేయించుకుని స్కాలర్‌షిప్ గ్రాంట్ చేయించుకుని ఊరికే వచ్చే ఆ డబ్బుతో జల్సా చేద్దామనుకుంటున్నాడు వాడు. దానికి చేయరాని ప్రయత్నాలు చేస్తున్నాడు. వాడిని చూస్తుంటే నాకు భయంగా అనిపిస్తోందిరా. అందుకే వాడిని మరింత పాడు చేయడం ఇష్టంలేకే సంతకం పెట్టనని ఖచ్చితంగా చెప్పేసాను" అన్నాను.

"వాడనే కాదు నాన్నా... ఈ కాలం పిల్లలంతా అలాగే వున్నారు. ఈజీ గోయింగ్ మనస్తత్వం పెరిగిపోతోంది. దేనినీ సీరియస్‌గా తీసుకోరు. విలువల పట్ల పట్టింపూ, ఆలోచనా వుండడం లేదు. ఎలాగోలా తాము అనుకున్నది సాధించడమే వాళ్ళ లక్ష్యం. ఆ రకమైన మనస్థత్వం వల్ల మనిషి విజయాలనైతే సాధించవచ్చేమో గానీ జీవితంలో సంతోషానికి దూరమౌతాడు. ఆ విషయం గ్రహించలేకపోతున్నారు. మనిషి వ్యక్తిత్వం రూపుదిద్దుకోవడం వెనుక కుటుంబ పరిస్థితులతోపాటూ అతడు పెరుగుతున్న సమాజంలోని పరిస్థితుల ప్రభావం కూడా వుంటుంది. దానిని మనం తప్పించలేం. తను చూస్తున్న, తనకి తెలిసిన వాటిని గుడ్డిగా నమ్మి అనుసరిస్తూ పోవడంకన్నా దానిలోని

> ఈ కాలం పిల్లలంతా అలాగే వున్నారు. ఈజీ గోయింగ్ మనస్తత్వం పెరిగిపోతోంది. దేనినీ సీరియస్‌గా తీసుకోరు. విలువల పట్ల పట్టింపూ, ఆలోచనా వుండడం లేదు. ఎలాగోలా తాము అనుకున్నది సాధించడమే వాళ్ల లక్ష్యం.

మంచి చెడులని బేరీజు వేసుకునే జ్ఞానాన్ని వాడికి నెమ్మదిగా మనమే నేర్పాలి" అన్నాడు రామం.

రామం మాటలు విన్న నేను ఆలోచనలో పడ్డాను.

❊ ❊ ❊

మర్నాడు చైతన్యని పిలిచి దగ్గర కూర్చోపెట్టుకుని వాడికి పెద్దగా తెలియని వాడి చిన్ననాటి మా కుటుంబ పరిస్థితులని గురించి, ఆనాటి ఆర్థిక పరిస్థితులని నేనెలా ఎదుర్కొన్నదీ, వాడికంటే పెద్దవాళ్ళిద్దరూ ఎలా కష్టపడి చదువుకున్నదీ వివరించాను. ఆ స్కాలర్‌షిప్ అప్లై చేయడానికి మొదట నేనెందుకు వద్దన్నానో నా అభిప్రాయం వెనుకనున్న నా ఫీలింగ్స్ కూడా వాడికి చెప్పాను. అంతా చెప్పాక అన్నాను.

"జీవితంలో డబ్బూ సౌకర్యాలూ ఎంతో ఆనందాన్ని స్తాయని నువ్వనుకుంటున్నావు... కానీ అవి ఇచ్చేది ఆనందాన్ని కాదు... కేవలం సుఖాన్ని మాత్రమే... ఆనందం వేరు, సుఖం వేరు. సుఖం ఎన్నో దారుల్లో లభిస్తుంది. కానీ ఆనందం మాత్రం కేవలం కష్టపడితేనే లభిస్తుంది. కష్టపడి దేనినైనా స్వయంకృషితో సాధించడం వెనుకే నిజమైన ఆనందం వుంటుంది. అందుకు నా జీవితం, మీ అక్క, అన్నయ్యల జీవితమే ఉదాహరణ. అది అనుభవిస్తేనే కానీ తెలియదు.

నీ స్నేహితుల లాగా నీకూ బైక్ మీద తిరగాలన్న కోరికతో ఫ్రీగా వచ్చే స్కాలర్‌షిప్ డబ్బుతో బైక్ కొనుక్కుందామనుకుంటున్నావు. అలా కొనుక్కోవడంవల్ల నీ కోరిక తీరచ్చు. కానీ అందులో కేవలం సుఖం మాత్రమే వుంటుంది. కానీ అదే బైక్‌ని కొనుక్కోవడానికి నువ్వు అప్పనంగా వచ్చే స్కాలర్‌షిప్ మీద ఆధారపడకుండా అందుకోసం సాయంత్రం పూట పార్ట్‌టైం జాబ్ చేస్తూ సంపాదిస్తే ఆ సుఖంతోపాటూ ఆనందం కూడా నీకు లభిస్తుంది."

నా మాటలకి చైతన్య ముఖంలో భావాలు మారడం గమనించాను.

"నేను చెప్పదలుచుకున్న విషయం నీకు అర్థమైందనుకుంటాను? నీకు అలాంటి ఆనందంతో కూడిన సుఖం కావాలనుకుంటే నేను చెప్పినట్లు చేయి. లేదా కేవలం సుఖం మాత్రమే కావాలనుకుంటే నీ కోరిక ప్రకారం నేను నీకు ఇన్‌స్టాల్‌మెంట్ల మీద బైక్ కొనిస్తాను. వాయిదాలని కట్టడానికి నేను మరో కొట్లో పద్దులు రాయడానికి ఒప్పుకుంటాను. అంతే గానీ ఆ స్కాలర్‌షిప్ అప్లికేషన్‌మీద సంతకం మాత్రం చేయను. ఎందుకంటే... నీ సుఖం కోసం నేను నా ఆనందాన్ని త్యాగం చేయలేను!" అన్నాను.

వంటింటి గుమ్మంలో నిల్చుని మా సంభాషణ ఆసాంతం విన్న రుక్మిణి నన్ను అర్థం చేసుకున్నట్టుగా చూస్తోంది.

చైతన్యతో నేను చెప్పదలుచుకున్నది చెప్పడం పూర్తి చేసి నా గదిలోకి వచ్చి మంచం మీద వాలాను. ఇప్పుడు నా మనసు ప్రశాంతంగా వుంది. మంచం పక్కనే వున్న టీపాయ్ మీద నేను ఎంతో కష్టపడి రూపాయి రూపాయి కూడబెట్టి కొనుక్కున్న పాతకాలంనాటి గ్రామ్‌ఫోన్ రికార్డులోంచి నాకిష్టమైన త్యాగరాజ కీర్తన నెమ్మదిగా వినిపిస్తోంది.

'నిధి చాలా సుఖమా, రాముని సేవా సన్నిధి చాలా సుఖమా... నిజముగ తెలుపవె మనసా... నిజముగ తెలుపవె మనసా...'

రికార్డు పాతదై అక్కడ అరిగిపోయిందనుకుంటాను, పాట వచ్చిన చోటే మళ్ళీ మళ్ళీ వస్తోంది. 'పాతదైనా చాలా విలువైన రికార్డు అది!' అనుకున్నాను. ★

**రచయిత చిరునామా:**
**ఆకునూరి మురళీకృష్ణ**
907, నాగార్జునా అపార్ట్‌మెంట్స్,
వెంకటరమణా కాలనీ మెయిన్‌రోడ్,
అశోక్‌నగర్, కర్నూలు.

